కోరం లేక సమావేశం వాయిదా

- గైర్హాజరైన మండల ప్రజాప్రతినిధులు
- 22వ తేదీకి వాయిదా వేసిన ఎంపీడీవో లలిత


సమావేశం వాయిదా వేస్తున్న ఎంపీడీవో లలిత

పాలకుర్తి: పాలకుర్తి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీకి వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీలకు ఇద్దరు ఎంపీటీసీలు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను సమర్పించని కారణంగా అనర్హత వేటుకు గురయ్యారు. ప్రస్తుతం 9మంది ఎంపీటీసీల్లో సర్వసభ్య సమావేశం నిర్వహణకు 5గురు ఎంపీటీసీలు కచ్చితంగా హాజరు కావాల్సి ఉంది. కాగా సమావేశానికి ఎంపీపీ వ్యాళ్ల అనసూర్యతో పాటు పాలకుర్తి, కన్నాల గ్రామ ఎంపీటీసీలు దుర్గం కుమార్, అతిఖ్‌లు మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం 12:30 నిమిషాల వరకు వేచి చూసినప్పటికీ మిగతా ఎంపీటీసీలు ఎవరూ హాజరుకాలేదు. దీంతో ఎంపీడీవో పూర్తిస్థాయి కోరం లేని కారణంగా సమావేశం 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు సమావేశానికి ఒకరిద్దరు సర్పంచుల మినహా మిగతా గ్రామాల వారు ఎవరూ హాజరుకాలేదు. ప్రజా సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించే సమావేశానికి పాలకులు గైర్హాజరు కావడంతో ప్రజా సమస్యల పరిష్కారంపై పాలకుల చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోందని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడునెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి తరచుగా గైర్హాజరయ్యే ప్రజాప్రతినిధులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మూలంగానే పాలకులు ఈరీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

స్వచ్ఛందంగా బ్యాంక్ ఉద్యోగుల రక్తదానం


రక్తదానం చేస్తున్న మేనేజర్ విద్యాసాగర్

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో బ్యాంకు మేనేజర్ సీహెచ్.విద్యాసాగర్, నాగమణి దంపతులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రతి ఏడాది బ్యాంక్ ఉద్యోగులు సామాజిక బాధ్యతగా తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం స్వచ్ఛందంగా రక్తదాన చేస్తున్నారని వారు తెలిపారు. శిబిరంలో సేకరించిన రక్తాన్ని మంచిర్యాల జిల్లాలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ ప్రశాంత్, సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, బట్టు కుమారస్వామి పాల్గొన్నారు.

సింగరేణి ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్‌ను ఆదరించండి


మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

రామగిరి: డిసెంబర్ 27న జరగనున్న సింగరేణి ఎన్నికల్లో కార్మికులు హెచ్‌ఎంఎస్‌ను ఆదరించాలని ఆర్జీ–3 ఏరియా వైస్ ప్రసిడెంట్ కొమ్ము మధునయ్య, బ్రాంచ్ సెక్రటరీ మహమ్మద్ ఇస్మాయిల్ కోరారు. శుక్రవారం సెంటినరీకాలనీ హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడే సంఘం కేవలం హెచ్‌ఎంఎస్ మాత్రమేనని, ఎలాంటి రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా కార్మికుల సమస్యలే ఏజెండాగా ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో గెలిచిన సంఘాలు సమ్మెలు లేకుండా కార్మికుల హక్కులను సాధించలేదని, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన హెచ్‌ఎంఎస్‌తోనే సాధ్యమని, హెచ్‌ఎంఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సెంట్రల్ కమిటీ సభ్యులు మహమ్మద్ ఖాన్, ఏఎల్‌పీ ట్రెజరర్ శాంతిస్వరూప్, బ్రాంచ్ సెక్రటరీ క్రాంతికిరణ్, ఫిట్ సెక్రటరీ రంజిత్‌కుమార్, మంగీలాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చాలి


మాట్లాడుతున్న రమేశ్

సుల్తానాబాద్‌రూరల్: నూతన ప్రభుత్వంలో ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం రమేశ్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు సుంకిశీల ప్రభాకర్‌రావు, మండల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ అర్ధంతరంగా ఆగిపోయిన ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతిపై నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పీఆర్సీ నివేదికను త్వరగతిన పూర్తి చేసుకొని మెరుగైన పీఆర్సీని అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సంఘం నాయకులు శ్రీనివాసరాజు, రవీందర్‌రావు ఉన్నారు.

సఖి కేంద్రం విధులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

జూలపల్లి: సఖి కేంద్రం విధులపై మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వెలుగు సమాఖ్య సభ్యులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ దారవేని స్వప్న మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలపై జరిగే గృహ హింస, వరకట్న వేధింపులు, ఆడపిల్లల అక్రమ రవాణా, సైబర్ క్రైమ్, బై స్టాండర్, గురించి మహిళలకు వివరించారు. మహిళా సాధికారత అవగాహన సదస్సులో భాగంగా జెండర్ స్పెషలిస్టు జాబు సుచరిత, జెండర్ ఈ క్వాలిటీ, డిస్క్రిమినేషన్, పోక్సోచట్టం, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, సుకన్య సమృద్ధి యోజన లేబర్ కార్డుపై అవగాహన కల్పించారు. ఈ అవగాహనలో సఖి కేంద్రం కేస్ వర్కర్ కనకం ఆశ్రిత, డీపీఎం తిరుపతి, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలో కొత్తగా నిర్మించిన ఎల్లమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు జరుగుతున్నాయి. గీత కార్మికుల ఆరాధ్యదైవమైన రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య వేడుకలు కనుల పండువగా జరిగాయి. సర్పంచ్ ఆడెపు వెంకటేశం దంపతులు, గ్రామస్తులు, గీత కార్మికులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


శుభ్రం చేస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీటి కాలువల్లో చెత్త చెదారం వేయొద్దని 8వ వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి కోరారు. 8వ వార్డులో శుక్రవారం స్వచ్ఛ శుక్రవార్ కార్యక్రమంలో భాగంగా చెత్త, చెదారం తొలగించి డ్రైనేజీలను శుభ్రం చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెందవన్నారు. కరుణాకర్, ఎల్లమ్మ, అనంతరాజు ఉన్నారు.

ఆర్థిక చేయూత



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కల మద్దికుంటకు చెందిన బొంకూరి శ్రీనివాస్ ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోయింది. నిరాశ్రయుడైన నిరుపేద కుటుంబానికి తమవంతుగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం వంటసామగ్రి, టార్పాలిన్, బ్లాంకెట్లు, రూ.2500 నగదు అందజేశారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ రాజ్‌గోపాల్, సభ్యులు శ్రీనివాస్, శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి, మధుకర్, రాజేశం, రాంచంద్రారెడ్డి ఉన్నారు.

వైభవంగా గంగాదేవి పట్నాలు



ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామంలో మందగొల్లలు వేసిన గంగాదేవి పట్నాల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మందగొల్ల పెద్ద అంజయ్య ఆధ్వర్యంలో వేసిన పట్నాలను భక్తులు తిలకించారు. నిర్వాహకులు కొంగర అనిల్, కొంగర రాజయ్య, కొంగర చిన్న సమ్మయ్య, కొంగర రాజేందర్, కొంగర పెద్దమల్లయ్య, కులపెద్దలు చినాల భూమయ్య, బావు ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

గోదావరిఖనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు గోదావరిఖని డిపో మేనేజర్ ఎం.నాగభూషణం తెలిపారు. ఈ పథకంలో భాగంగా సిటీ, ఆర్డినరీ, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు, ట్రాన్స్‌జెండర్స్ రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా తమ గుర్తింపు కార్డు (ఆధార్, ఓటర్ ఐడీ కార్డు) చూపించి ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: దివ్యాంగుల సంక్షేమం కోసం కృషిచేసిన వ్యక్తులు, సంస్థలు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన దివ్యాంగులు దివ్యాంగుల సాధికారిత అవార్డు–2023 కోసం ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి రవ్ఫ్‌ఖాన్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారికి అవార్డులు అందిస్తారన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 94408 52495ను సంప్రదించాలన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఓదెల: భారత గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఓదెల భారత గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ క్యాతం సత్యనారాయణ సూచించారు. శుక్రవారం ఓదెలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత పెట్రోలియం కార్పొరేషన్ ఆదేశాల మేరకు ఈ-కేవైసీ నమోదు కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. గ్యాస్ వినియోగదారులు ఆధార్‌కార్డు గ్యాస్‌బుక్ తీసుకొచ్చి వేలిముద్రలతో గ్యాస్ కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. గ్యాస్‌బుక్ చేసుకొనే వినియోగదారులు 77150 12345, 77180 12345 నంబర్లకు కాల్ చేసి ఆన్‌లైన్ ద్వారా 24గంటలు బుక్‌చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం సెల్ నెంబర్ 96523 73791ను సంప్రదించాలన్నారు.

కనుల పండువగా మహా పడిపూజ


పడిపూజలో పాల్గొన్న భక్తులు


పూలాభిషేకం చేస్తున్న గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం రాత్రి అంగరంగ వైభవంగా మహాపడి పూజ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన గురుస్వామి సారంగచారి ఆధ్వర్యంలో చెలకాని శ్రీనివాస్ స్వామి వారి కుటుంబ సభ్యులతో మహా పడిపూజ మహోత్సవం నిర్వహించారు. శ్రీఅయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి 18 రకాల పూలతో పూలాభిషేకం నిర్వహించారు. 18 మెట్లకు పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి పునఃప్రతిష్ఠాపనోత్సవం


ఆలయంలో ప్రతిష్ఠాపనోత్సవం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలోని భక్తాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో పునః ప్రతిష్ఠాపనోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీసీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామాలయ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఆలయ కమిటీతో పాటు గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుబుక్స్ అందజేత

జూలపల్లి: మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకార్థం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అథిక్‌పాషా అందజేశారు.

హెచ్‌ఎంఎస్‌లో చేరికలు


హెచ్‌ఎంఎస్‌లో చేరిన కార్మికులతో నాయకులు

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గనికి చెందిన సుమారు 20మంది కార్మికులు హెచ్‌ఎంఎస్‌లో చేరగా వారికి ఏపీఏ వైస్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్, బ్రాంచ్ సెక్రటరీ బండారి క్రాంతి కిరణ్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్మికుల సమస్యల పరిష్కారం హెచ్‌ఎంఎస్‌తోనే సాధ్యమని భావించి కార్మికులు హెచ్‌ఎంఎస్‌లో చేరుతున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ అజ్మీర రంజిత్ కుమార్, బ్రాంచ్ ట్రెజరర్ శాంతిస్వరూప్, మహేందర్, నవీన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు బిక్ష



సుల్తానాబాద్: పట్టణంలోని స్వప్నకాలనీకి చెందిన కాసర్ల మధుసూదన్‌రెడ్డి, శోభారాణి దంపతులు శుక్రవారం శాస్త్రీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అయ్యప్పస్వాములకు బిక్ష నిర్వహించారు. తమ కుమారుడు వంశీకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా బిక్ష నిర్వహించినట్లు మధుసూదన్ తెలిపారు.

ఘనంగా బహుళ ఏకాదశి వేడుకలు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫెర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం బహుళ ఏకాదశి పురస్కరించుకొని శుక్రవారం ఆలయంలో ఆలయ అర్చకులు పవన్‌కుమార్ చార్యులు హోమం, 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం నిర్వహించారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు గెలుపుకోసం సహకరించిన యైటింక్లయిన్‌కాలనీ జమాత్ ఇస్లాం మసీద్ సోదరులకు శుక్రవారం కాలనీ, వెంకట్రావుపల్లి కాంగ్రెస్ నాయకులు మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి పోగుల వీరారెడ్డి, వెంకట్రావుపల్లి నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సదానందం, విజేందర్‌రెడ్డి, రబ్బాని, రాములు, సతీశ్, రమేశ్, అప్సర్, ఎండీ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం కార్తీక మాసం ఏకాదశి చివరి శుక్రవారం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. రుద్రాభిషేకం చేసిన అనంతరం పలువురు శేషవస్త్రాన్ని బహూకరించారు. భక్తులకు తీర్థప్రసాదా లను పూజారులు మహేశ్, రమేశ్ అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డుపై నీటి గుంతలు.. పాదచారులకు ఇక్కట్లు



జ్యోతినగర్: రోడ్డుపై నీటి గుంతలతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ నుంచి ఎన్టీపీసీ పర్మనెంట్ టౌన్‌షిప్, ఎఫ్‌సీఐ టౌన్‌షిప్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. నీరు నిల్వ ఉండటంతో పాదచారులు వెళ్తుండగా వాహనాల రాకపోకలతో నీరు పాదచారులపై చిమ్మడంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక


ఆదిత్యను అభినందిస్తున్న కోచ్‌లు

మంథని: న్యూఢిల్లీలో ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి కరాటే పోటీలకు బేర ఆదిత్య ఎంపికైనట్లు పట్టణానికి చెందిన షోటో ఖాన్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు తెలిపారు. ఈ నెల నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ముగ్గురు విద్యార్థులు పాల్గొనగా అండర్ 17–25 కేజీ విభాగంలో బేర ఆదిత్య తేజ ప్రతిభ కనబరచారు. గోల్డ్ మెడల్ సాధించి న్యూఢిల్లీలో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్లు నాగరాజు పేర్కొన్నారు.

విద్యుత్ సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారులోని రంగంపల్లి, గుండంకట్ట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ సత్యనారాయణ తెలిపారు. మరమ్మతు పనుల కారణంగా ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కమాన్‌పూర్ మండలంలో..

కమాన్‌పూర్: మండలంలోని కమాన్‌పూర్, రొంపికుంటలో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రాజేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలలో అంతరాయం కలుగుతుందన్నారు.

యైటింక్లయిన్‌కాలనీలో..

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ శ్రీనివాస్, లైన్‌మెన్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. అల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని సంతోష్ నగర్, హనుమాన్‌నగర్, కేకే నగర్, న్యూమారేడుపాక, అల్లూరు, ఇందిరానగర్ తదితర ఏరియాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎలిగేడులో..

ఎలిగేడు: మండలంలోని ఎలిగేడు, లోకపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ సంపత్‌రెడ్డి తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్‌లలో ప్రతినెలా రెండో శనివారం నెలవారీ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు


పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు


మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న రాజ్‌ఠాకూర్

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్నీ, గజ్జెల కాంతం శుక్రవారం రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని శ్రీధర్‌బాబు నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం

జ్యోతినగర్: మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబును రామగుండం నగరపాలక సంస్థ 24వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక సుజాత ఘనంగా సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

మంథని: మంథని ఎమ్మెల్యేగా ఎన్నికై రాష్ట్ర మంత్రి పదవి చేపట్టిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యేగా ఎన్నికైన మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను శుక్రవారం మంథనికి చెందిన కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి, మీడియా కన్వీనర్ ఇనుముల సతీశ్ హైదరాబాద్‌లో కలిసి శుభకాంక్షలు తెలిపారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ శుక్రవారం కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

రామగిరి: రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును శుక్రవారం జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ ఇజ్జగిరి రాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంథని నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని, గ్రంథాలయల అభివృద్ధికి తోడ్పడాలని, ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని మంత్రిని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా వాటర్ ట్యాంకు



కాల్వశ్రీరాంపూర్: మండలంలోని చిన్నరాతుపల్లి గ్రామంలో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉన్న ఈ ట్యాంకు గుండా అనునిత్యం వాహనదారులు, వ్యవసాయదారులు, కూలీలు ప్రయాణం చేస్తారు. కూలితే ప్రమాదం తప్పదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్యాంకును కూల్చివేయాలని కోరుతున్నారు.